క్లుప్తంగా

కూలీలకు పనిదినాలు పెంచాలి



డొంకేశ్వర్: ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు పెంచాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గంగసరంలో గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో గురువారం మాట్లాడారు. ఈజీఎస్ నిబంధనల ప్రకారం వేసవి భత్యం, ఇతర ఖర్చులు కూలీలకు చెల్లించాల్సి ఉన్నా అమలు కావడం లేదన్నారు. పనిచేసే చోట వసతులు, మెడికల్ కిట్లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోజువారి కూలిని రూ.600కు పెంచి పనిపరికరాలు అందజేయాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం ఉదయం 11 గంటలకు ఉంటుందని అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆర్డీవోకు ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో తొగర్ల రాజు బాయికి చెందిన వారసత్వ అసైన్డ్ భూమిని గోవర్ధన్ అనే వ్యక్తి అక్రమంగా పట్టా చేసుకున్నాడని దాన్ని రద్దు చేయాలని కోరుతూ బాధితులు నాగశ్రీనివాస్ ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. సర్వే నంబర్ మార్చి అసైన్డ్‌భూమిలో ఏ విధంగా పేరు మార్చి పట్టా చేసుకున్నారో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: మండలంలోని చేపూర్ శివారులో ఉన్న దత్త సాయి ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, భూమన్న, పేట్ల సంజీవ్, ఎర్మా భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానిక ముస్కు నర్సయ్య దంపతులు తమ వంతుగా రూ. 51 వేల విరాళాన్ని వీడీసీ సభ్యులకు గురువారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త తోపారం రమేశ్ చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడటంతో ఆయనకు పార్టీ కార్యాలయం నుంచి మంజూరైన రూ. రెండు లక్షల బీమా చెక్కును ఎంపీపీ సుకఖ్య గురువారం అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన మాజీ సీఎం కేసీఆర్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నందిపేటకు చేరిన పుస్తకాలు



నందిపేట్: మండలానికి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో పొద్దుటూరి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. ఉమ్మడి నందిపేట మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలకు 1 నుంచి 10వ తరగతి వరకు 5239 మంది ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో చదువుతున్నారు. వీరికి 70 వేల పుస్తకాలు అవసరం. ఇందులో పాఠ్యపుస్తకాలలో తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యంశాలు ఒకే పుస్తకంలో రావడంతో మండలానికి పార్ట్–1, 2 కలిపి 35 వేల పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. మిగతా పుస్తకాలు త్వరలో రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూలితేనే స్పందిస్తారా..?

- శిథిలావస్థలో సబ్ స్టేషన్ కంట్రోల్ రూం
- ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి
- భయం.. భయంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది



కంట్రోల్ రూం గోడలకు ఏర్పడిన పగుళ్లు



సాలూరలోని విద్యుత్ సబ్ స్టేషన్

బోధన్: సాలూర మండల శివారులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కంట్రోల్ రూం శిథిలావస్థకు చేరింది. గోడలకు పగుళ్లు ఏర్పడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. భారీ ఈదురుగాలులు, వర్షం కురిస్తే సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కంట్రోల్ రూం గది కూలితేనే స్పందిస్తారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన విషయం విద్యుత్‌శాఖ జిల్లా, డివిజన్ శాఖ అధికారుల దృష్టికి చేరినా నూతన గది నిర్మాణానికి నోచు కోవడం లేదు. ప్రతి ఏటా నూతన గది నిర్మాణానికి సబ్ డివిజన్ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించడం కొన్నేళ్లుగా సాగుతోంది. నిధులు మంజూరు కాకపోవడంతో శిథిలావస్థ గదిలోనే సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

నష్టం జరగకముందే..

సబ్ స్టేషన్ తూర్పు దిశలో పంట పొలాలు ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో పశువులు సబ్ స్టేషన్‌లోకి వచ్చే పరిస్థితి ఉంది. ఈ సబ్‌స్టేషన్ నుంచి సాలూర, తగ్గెల్లి, ఫత్తేపూర్, జాడిజమాల్‌పూర్, సాలూర క్యాంప్, కొప్పర్తి క్యాంప్, నాగన్‌పల్లి గ్రామాలకు కరెంట్ సరఫరా పర్యవేక్షణ ఉంటుంది. ఏఈతో పాటు ముగ్గురు లైన్‌మన్లు, జేఎల్‌ఎంలు, ఇద్దరు ఆపరేటర్లు, ఒకరు ఫోర్‌మెన్ సబ్ స్టేషన్ కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున భారీ వర్షాలు, ఈదురుగాలులకు కంట్రోల్ రూం గదికి నష్టం జరిగితే కరెంట్ సరఫరా అంతరాయం ఏర్పడే అవకాశాలున్నాయి. ప్రతి రోజు పగలు రాత్రి ఆపరేటర్లు సబ్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త గది నిర్మాణం చేపట్టే వరకైనా ఉన్న పాత గదికి మరమ్మతులు చేపడితే ఆపరేటర్ల భద్రతకు భరోసా ఉంటుంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన గది నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

30 ఏళ్ల క్రితం సబ్ స్టేషన్ మంజూరు

సాలూర గ్రామానికి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. ఈ గ్రామం ప్రస్తుతం కొత్త రెవెన్యూ మండలంగా ఏర్పాటైంది. మండల కేంద్రం శివారులో గిద్ద చెరువు ఒడ్డున, బోధన్ నుంచి మహారాష్ట్ర వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఆ సమయంలో సబ్ స్టేషన్ కంట్రోల్‌రూం కోసం సిమెంట్ రేకులు పైకప్పుతో గదిని నిర్మించా రు. నాటి నుంచి నేటి వరకు కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. గోడకు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా పగుళ్ల మధ్య నుంచి విష పురుగులు గదిలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం.

ప్రతిపాదనలు పంపించాం

సాలూర సబ్ స్టేషన్ కంట్రోల్ రూం నూతన నిర్మాణానికి అంచనా వ్యయంతో అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంటుంది. కంట్రోల్ రూం గది శిథిలావస్థలో ఉన్న విషయం వాస్తవమే.

– కళ్యాణ్, ఏఈ, సబ్ డివిజన్ బోధన్

విత్తన దుకాణాల్లో తనిఖీ



వేల్పూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ




ముప్కాల్‌లో వ్యవసాయ అధికారులు

వేల్పూర్/ బాల్కొండ: వేల్పూర్ మండలంలో వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని విత్తన దుకాణాలను భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లో గుర్తింపు పొందిన విత్తన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు తీసుకొచ్చి రైతులకు విక్రయించాలన్నారు. సీడు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి నర్సయ్య సూచించారు. కాల వ్యవధి దాటిన విత్తనాలను, పురుగు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై వినయ్ దుకాణదారులను హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. పురుగుమందులు అందించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన ఎడల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయాధికారి రాజుకుమార్ ఎస్సై భాస్కరాచారితో కలిసి తనిఖీ చేశారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూరగాయల ధరలు పైపైకి..

- రోజు రోజుకూ పెరుగుతున్న ధరలు
- పచ్చిమిర్చి కిలో రూ. 100
- మిగతావి రూ. 50కి పైమాటే
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు



ఆర్మూర్‌టౌన్: కూరగాయల ధరలు వామ్మో అనిపిస్తున్నాయి. అదీ, ఇదీ అని లేదు దాదాపు అన్ని కూరగాయల ధరలు పైపైకి చేరడంతో సామాన్య ప్రజల నోట మాట రావడం లేదు. ఎండాకాలం కావడం, పలు శుభకార్యాలు ఉండడంతో డిమాండ్ పెరిగి కూరగాయల ధరలు కొండెక్కాయి. రైతుల దగ్గర పంట లేదు. ఎండా కాలం పంట పండదు. ఇదే అదునుగా కూరగాయల వ్యాపారులు ధరలు పెంచి నిలువు దోపిడీ చేస్తున్నారు. సామాన్యుడి వంట గదిలో కూరలు ఉడకకుండానే కుతకుతమంటున్నాయి. కనీసం రూ. వందకు రెండు కూరగాయలు కూడా రావడం లేదు. గత కొన్ని రోజుల నుంచి కిలో టమాట రూ. 40 నుంచి రూ. 60 మధ్య కొనసాగుతోంది. మార్కెట్‌లో టమాటానే కాకుండా ప్రతి కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజుల్లో కిలో రూ. 30కు లభించే కూరగాయలు ప్రస్తుతం కిలో రూ. 50 నుంచి రూ. 80 వరకు ఉన్నాయి. కూరగాయలు కొన్నచోట కొత్తమిర, మెంతికూరలు ఇవ్వమని అడిగేవాళ్లం, కానీ ప్రస్తుతం కొత్తిమీర, మెంతికూరలు సైతం రూ. 10 ఇవ్వందే ఇవ్వలేని పరిస్థితి. ఇలా సామాన్యుడు కూరగాయలు కొనాలంటేనే బెంబేలెత్తుతున్నాడు. డిమండ్‌కు సరిపాడా లోకల్ కూరగాయల నిల్వ లేక ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో రవాణా చార్జీల భారం సైతం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం రైతుబజార్, బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు(కిలో)	ధర		
టమాట	రూ. 40	బెండకాయ	40
మిర్చి	100	బంగాళదుంప	40
వంకాయ	50	కాకరకాయ	50
బీరకాయ	50	పాలకూర	80
క్యారెట్	70	చిక్కుడుగాయ	60

రూ. వందకు రెండే కూరగాయలు

కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఏం కొనలేని పరిస్థితి ఏర్పడింది. రూ. వంద తీసుకెళ్తే కేవలం రెండు రకాల కూరగాయలే వస్తున్నాయి. ధరలు పెరగడంతో నచ్చిన వంటకాలు తినలేకపోతున్నాం.

– ప్రమీల, గృహిణి, ఆర్మూర్

పెరుగుతున్న ధరలతో భయం

పెరుగుతున్న కూరగాయల ధరలతో భయంగా ఉంది. ఏం కొనే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఏ కూరగాయలు కొన్నాలన్నా ధరలు విపరీతంగా పెరిగాయి. మొన్నటి వరకు రూ.10 కిలో ఉన్న టమాల రూ.40కు చేరింది. సామాన్య ప్రజలు ఏం తినాలో అర్థం కావడం లేదు.

– శ్రీదేవి, గృహిణి, ఆర్మూర్

ఉచిత వైద్య శిబిరం



బోధన్: పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో జీవన్ సేవ వెల్‌నెస్ గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచిత వైద్యరోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 400 మంది శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. న్యూరోపెయిన్ థెరపీ నిపుణుడు చంద్రశేఖర్, నేచురోపతి వైద్యులు నాగ్‌నాథ్, సదానంద్ గౌడ్, హకీం, సిబ్బంది గీత, సంజన తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

– బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్: వానాకాలం సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల అవసరాల మేరకు సొసైటీల్లో సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. రైతులు అవసరమైన ఎరువులు, విత్తనాలను స్టాక్ చేసుకుంటే మళ్లీ గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకుని కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని వివరించారు. అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం అందించాలన్నారు.

మెప్మా సమాఖ్యల ఆడిట్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సమాఖ్యల ఆడిట్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా అధికారి సాయి చరణ్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు 2023–24 ఏడాదికి సంబంధించిన ఆడిట్ చేపట్టారు. ప్రతి ఏడాది మెప్మా సమాఖ్యల వార్షిక ఆడిట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, రాజలింగం, సమాఖ్యల అధ్యక్షులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

కోటగిరి: జీపీ కార్యదర్శులు తమ విధి నిర్వహణలో అశ్రద్ధ చేయొద్దని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జీపీ కార్యదర్శులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని, హరితహారం మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని, కొత్తగా మొక్కలు నాటడానికి అనువైన ప్రాంతాలు గుర్తించాలన్నారు. గతంలో ఐహెచ్‌ఎల్ నిర్మించుకుని బిల్లులు రానివారి వివరాలు సేకరించాలన్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న వారి ఐహెచ్‌ఎల్ నిర్మాణానికి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి మారుతీ, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌ఎస్‌కు ఎంపిక

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌ఎస్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం కొండగోవర్ధన్ గురువారం తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు నల్లవెల్లి రుత్విక, ఎర్రమొల్ల నిహారికలు రాబోయే 4 సంవత్సరాలలో రూ.48వేల ఉపకార వేతనం పొందుతారన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

జీవాలకు వ్యాధి నివారణ టీకాలు



కోటగిరిలో జీవాలకు టీకా వేస్తున్న సిబ్బంది

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో పశుసంవర్ధక సిబ్బంది జీవాలకు గురువారం వ్యాధి నివారణ టీకాలు వేశారు. వర్షాకాలంలో జీవాలకు సోకే చిటుక వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. కోటగిరిలో 1300 మేకలు, గొర్రెలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సుధీర్, సిబ్బంది, గొర్రెలు, మేకల పెంపకం దారులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా



వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

పెర్కిట్: వేతనం తీసుకోకుండా ఉద్యోగ విరమణ పొందిన పూర్వ వీఆర్‌ఏల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉద్యోగ విరమణ పొందిన వీఆర్‌ఏలు గురువారం వినయ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జీవో నెంబరు 81, 85, 98 ద్వారా వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో 50 మంది, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 160 మంది ఎలాంటి ఆర్థిక ప్రయోజనం పొందకుండానే ఉద్యోగ విరమణ పొందినట్లు వినయ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఎడపల్లి: ప్రభుత్వ రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి ఆనవాళ్లు లేకుండా చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జాన్కంపేట రైతులు తహసీల్దార్, ఎస్సైలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. జాన్కంపేట్‌లోని నిజాంసాగర్ మెయిన్ కెనాల్ కింది భాగంలో ఉన్న ప్రభుత్వ దారి స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన పిట్ల గంగాధర్, కుటుంబీకులు కబ్జా చేసి రోడ్డు ఆనవాళ్లు లేకుండా చేశారని పేర్కొన్నారు. గతంలో కూడా ఈ దారిని సదరు వ్యక్తి కబ్జా చేసినట్లు నిజామాబాద్ సర్వే ఏడీకి తాము ఫిర్యాదు చేయగా 22 ఫీట్ల దారిని కబ్జా చేసినట్లు అధికారుల విచారణలో తేలిందన్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకొని, రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు దారిని ఉంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రషీద్, జక్కం చిన్న లింగం, ఎజాజ్ అలీ, ఆరోల్ల గంగాధర్, ఓర్సు రాజు, బాబురావు, రైతులు ఉన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



దూపల్లిలో పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రెంజల్: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం వరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులు పూర్తయ్యేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి వాజీద్ సూచించారు. మండలంలోని దూపల్లి, కూనేపల్లి, దండిగుట్ట, బాగేపల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను స్థానిక అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పాఠశాలల్లో మరగుదొడ్లు, బాలికలకు ప్రత్యేకంగా మూత్రశాలలు, విద్యుత్, తాగునీటి వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు, ఏఈతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

'ఇందూరు'కు ఐబీఏ అవార్డు



అవార్డుతో కిశోర్‌కుమార్

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలో ఉన్న ఇందూరు ఉన్నత పాఠశాలకు బెస్ట్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ వారు అందజేశారు. ఈ పాఠశాల గత 15 ఏళ్లుగా బెస్ట్ అవైలేబుల్‌గా ప్రభుత్వంతో కలిసి నిరుపేద విద్యార్థులకు విద్యను అందిస్తుందని, ఎన్‌సీసీ, స్కౌట్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో పాటు ఎన్‌సీసీలో రెండుసార్లు నేషనల్ పరేడ్‌తో పాటు జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌లో బహుమతులు సాధించింది. పాఠశాల నిర్వహణలో మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయుల అంకిత భావం, క్రీడా మైదానం, విద్యాబోధన అంశాలను పరిగణలోకి తీసుకొని న్యూఢిల్లీకి చెందిన హైఫ్లైడ్ మీడియా గ్రూప్ వారు ఏప్రిల్ 20న ఇందూర్ హైస్కూల్‌ను ఐబీఏ- 2024 అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును పోస్టు ద్వారా సోమవారం పాఠశాలకు పంపించారని కరస్పాండెంట్ కోడాలి కిశోర్‌కుమార్ తెలిపారు. తమ పాఠశాలకు అంతర్జాతీయ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని, పాఠశాలకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

'జిల్లాలో ఎరువుల కొరత లేదు'



ధర్పల్లి: జిల్లాలో ఎరువుల కొరతలేదని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) వాజిద్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని రామడుగు, హొన్నాజీపేట్, ధర్పల్లి సొసైటీలతోపాటు ఎరువుల, విత్తనాల దుకాణాల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను ఆయన గురువారం పరిశీలించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు ఎరువులు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని, అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేయొద్దని సూచించారు. కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆయనవెంట ఏవో వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన



బెల్లాల్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బోధన్: మండలంలోని బెల్లాల్‌లో ఏసీఎఫ్ టీబీ వైద్య సిబ్బంది ప్రజలకు గురువారం టీబీపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. టీబీ, ఇతర వ్యాధులకు గురైన రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీబీ వ్యాధి సూపర్‌వైజర్ మహ్మద్ హసన్, ల్యాబ్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎం సంధ్యారాణి, నాగజ్యోతి, ఆశా వర్కర్లు రజిత, అరుణ, శోభ, స్వరూప పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – లవ్‌మీ (తెలుగు) – 12.05, 6.15
ఫ్యూరియోసా (తెలుగు) – 3.00
హిట్‌లిస్ట్ (తెలుగు) – 9.10

స్క్రీన్-3 – గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) – 10.00, 1.05, 4.10, 7.15, 10.20

స్క్రీన్-3 – గంగం గణేశా (తెలుగు) – 12.15, 3.20, 6.25, 9.30
భజే వాయువేగం – 10.35, 1.30, 4.25, 7.20, 10.15